క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు



గన్నవరం:స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డస్ట్‌బిన్‌లను పంపిణీ చేసింది. ఈ మేరకు గురువారం డిపో మేనేజర్ పి. శివాజీకి మానవత సంస్థ ప్రతినిధులు ఏడు డస్ట్‌బిన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించాలని కోరారు. ముఖ్యంగా ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్‌లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. మానవత కన్వీనర్ కర్రా వరప్రసాద్, ఉపాధ్యక్షులు పువ్వుల ఆదినారాయణ, కార్యదర్శి వీవీ కృష్ణమోహన్, కోశాధికారి పొట్లూరి రామకృష్ణారావు, డైరెక్టర్లు మోటమర్రి శేఖర్, శ్రీకాకుళపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం



గన్నవరం రూరల్: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేస్తానని పీఏసీఎస్ చైర్మన్ గొట్టిపూళ్ల వీరబాబు అన్నారు. మండలంలోని సూరంపల్లి శ్రీ గాంధీ మహర్షి ప్రాథమిక సహకారం పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ సొసైటీని లాభాల బాటలో నడిపిస్తానని తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు విత్తనాలు అందజేస్తామని చెప్పారు. సర్పంచ్ ఈలప్రోలు వాసు, డైరెక్టర్లు రామినీడు బసవపూర్ణయ్య, బాలనాయక్, ఎంపీటీసీ సభ్యులు గండికోట సీతారామయ్య, బాణావత్ నీలిమ, పాలకేంద్రం అధ్యక్షుడు ఈలప్రోలు రాంబాబు, బెజవాడ కోటేశ్వరరావు, సొసైటీ సీఈవో జొన్నలగడ్డ సరిత, రాంబాబు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



గన్నవరం రూరల్:పూర్వ విద్యార్థుల సహాయం అభినందనీయమని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎస్.నాగవేణి అన్నారు. స్థానిక పాఠశాలలో 1981–82 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు గత ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన షేక్ సల్మా, టి.గాయత్రిలకు నగదు పురస్కారాలు అందజేశారు. ప్రతి సంవత్సరం ఈ పూర్వ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తూ వస్తున్నారు. వారి వితరణను, సహకారాన్ని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



ఉంగుటూరు(గన్నవరం):యూరియా కృతిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జె. విమలకుమారి ఎరువుల విక్రయ డీలర్లను హెచ్చరించారు. మండల కేంద్రమైన ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో గురువారం మండలంలోని ఎరువుల విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. ఎరువులను ఎమ్మార్పీకి మించి విక్రయించరాదని చెప్పారు. వేరే ఎరువుల ఉత్పత్తులతో ముడిపెట్టి యూరియా అమ్మరాదని స్పష్టం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెటింగ్ తరలిస్తే మాత్రం చట్ట పరమైన చర్యలతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరికలు జారీచేశారు. మండల వ్యవసాయ అధికారి జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణంపై చర్యలు



పెనమలూరు:యనమలకుదురు శివపార్వతీనగర్‌లో అనధికార నిర్మాణం చేస్తున్న భవనం పై మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం చర్యలు తీసుకున్నారు. కొండ వెనుక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా బిల్డర్ అదనపు అంతస్తులు నిర్మాణం చేపట్టారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణాన్ని కూల్చారు. చట్ట విరుద్ధంగా భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ షేక్.నజీర్ హెచ్చరించారు.



గొడవర్రులో నీట మునిగిన వరి పొలాలు



ఉంగుటూరు-నందమూరు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు



కంకిపాడులో నేలవాలిన భారీ వృక్షం

ముంపులో పంట పొలాలు

- ఆందోళనలో రైతులు
- వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు
- ఉధృతంగా బుడమేరు, వన్నేరు వాగులు
- సావరగూడెం రహదారిపై పొంగిన చీమలవాగు

కంకిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు ముంపునకు గురయ్యాయి. వర్షానికి ఈదురుగాలులు తోడవ్వటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రహదారులు అధ్వానంగా మారటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి కంకిపాడు పట్టణంలోని విజయవాడ-మచిలీపట్నం రోడ్డు మార్గం వెంబడి భారీ వృక్షం నేలకూలింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం, గొడవర్రు, ప్రొద్దుటూరు, జగన్నాధపురం పరిసరాల్లో పంట పొలాల్లో వర్షపునీరు నిలిచి పొలాలు ముంపునకు గురయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం 450 ఎకరాల్లో వరి పొలాలు ముంపు బారిన పడినట్లు సమాచారం. ఇప్పటికే ఎకరాకు రూ 18 వేలు వరకూ రైతులు పెట్టుబడులు పెట్టారు. వరుసగా రెండు రోజులు పాటు వర్షపునీటిలో వరి నాట్లు నానటంతో మొక్క కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని మద్దూరు-గోసాల, ఈడుపుగల్లు-ఉప్పలూరు, పునాదిపాడు ప్రధాన రహదారి పరిసరాలు వర్షం కారణంగా అధ్వానంగా తయారయ్యాయి.

కోతకు గురైన పాత వంతెన రోడ్డు...

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతం బుడమేరు పాత వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వంతెన వద్ద ఈ పరిస్థితి నెలకొంది. రానూ రానూ నీటి ఉధృతి పెరగడంతో వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. గత రెండు రోజులుగా వంతెన ముంపునకు గురి అవ్వడంతో రోడ్డు దెబ్బతిని ఆరు అడుగల మేర కోతకు గురైంది. దీంతో వంతెన పై నుంచి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. నిత్యం వంతెన పై నుంచి ఫ్లెక్టైవర్, గుణదల, అబ్దుల్ కలాం కాలనీ, పలు ప్రాంతాలకు గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు తమ తమ పంట పొలాలకు వంతెన దాటుకుని వెళుతుంటారు. రాకపోకలు సాగించడానికి ఉన్న ఒక్కగానొక్క ఈ పాత వంతెన ముంపునకు గురై రోడ్డు కోత పడటంతో పలు గ్రామాల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటితో పాటు భారీగా చెత్త, వ్యర్థాలు కొట్టుకు వచ్చి వంతెన వద్ద గుట్టలుగా నిలిచిపోయాయి. ఈ వ్యర్థాల ఫలితంగా కాలువలో సజావుగా ప్రవహించక సమీప నివాసాల్లోకి వదర నీరు చేరుకుంటుంది. వంతెన వద్ద గుట్టలుగా నిలిచిన వ్యర్థాలను తొలగించడంతో విఫలం చెందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫలితంగా సమీప నివాసాల్లోకి వరద నీరు చేరుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు ఇక్కడి పరిస్థితులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వంతెన వద్ద మరమ్మతులు నిర్వహించాలని, పేరుకుపోయిన చెత్త గుట్టలను తొలగించాలని కోరుతున్నారు.

ఉంగుటూరు(గన్నవరం): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉంగుటూరు మండలంలో బుడమేరు కాలువ, వన్నేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉంగుటూరు-నందమూరు మధ్య ఉన్న బుడమేరు కాలువ కాజ్‌వేపై అడుగు ఎత్తున్న నీరు ప్రవహిస్తుంది. దీంతో తేలప్రోలు-ఉయ్యూరు ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వంతెన వద్ద గుర్రపు డెక్క భారీగా పేరుకుపోయి వర్షం నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. అదే విధంగా ఇందుపల్లి-లంకపల్లి మధ్య వన్నేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీటి ప్రవాహంతో వన్నేరు వాగు పొంగి పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇందుపల్లి, ముక్కపాడు, చాగంటిపాడు, కంద్రిక, వెంకటరామపురం గ్రామాల పరిధిలో వందలాది ఎకరాలు వరినాటు వేసిన పొలాలు నీట మునిగాయి.

గన్నవరం రూరల్: మండలంలోని కేసరపల్లి-సావరగూడెం గ్రామాల మధ్య చీమలవాగు పొంగి ప్రవహిస్తుంది. రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంది. బుధవారం రాత్రి అధిక వర్షం కురవటంతో ఎగువ నుంచి వర్షం నీరు దిగువకు వస్తుండటంతో సావరగూడెం రహదారి మార్గంలో రోడ్డు మునిగిపోయింది. గురువారం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



మద్దూరు పరిధిలోని వరి పొలాల్లో చేరిన వర్షపునీరు



కాసరనేనివారిపాలెం వద్ద నీట మునిగిన శివాలయం



సావరగూడెం రహదారిపై పొంగిన చీమలవాగు

దూసుకొస్తున్న వరద నీరు



పెనమలూరు:కృష్ణానదిలో వరద ఉధ్ధతి పెరిగి నదీ పరివాహక గ్రామాలపై వరద నీరు దూసుకు వస్తుంది. ప్రకాశం బ్యారేజీ వద్ద 5.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వదలటంతో నది పరవళ్లు తొక్కుతోంది. యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల వద్ద నది కట్టకు తన్నిపెట్టి ప్రవహిస్తుంది. కాగా యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల పరిధిలో కరకట్ట దిగువున వేలాది కటుంబాలు నివాసం ఉండటంతో వదర కారణంగా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నదికి ఆనుకోనే బిల్డర్లు చట్ట విరుద్ధంగా గృహాలు నిర్మించి అమ్మేశారు. గృహాల్లో ఉండే నివాసితులు నదికి వరద రావటంతో తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతంలో బుడమేరు వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు



ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు

యనమలకుదురులో మహిళల నిరసన



యనమలకుదురులో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో గురువారం మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి మురుగునీటి సమస్యపై నిరసన వ్యక్తం చేశారు. ఇళ్ల సమీపంలో మురుగునీరు ఉంటే ఎలా ఉండాలని నినాదాలు చేశారు. గ్రామంలో డోంక రోడ్డు వినాయక్‌నగర్ ప్రాంతంలో డ్రెయినేజీలోని మురుగు నీరు నేరుగా రోడ్డు పైకి వచ్చి నిలిచిపోతుంది. పైగా మంచి నీటి పైప్‌లైన్ డ్రెయినేజీలో ఉండటంతో కలుషిత నీరు వస్తుందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వలన విరోచనాలు, వాంతులతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన చెందారు. డ్రెయినేజీని ఎత్తు లేపి మురుగునీరు పారుదల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని, వెంటనే రోడ్డును కూడా ఎత్తు లేపాలన్నారు. మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో మున్సిపాలటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలు షేక్.వలిబి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్.ఖాశిం పలువురు పాల్గొన్నారు.

జనసురక్ష పథకాలతో సామాన్యులకు భద్రత

ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.లక్ష్మీకాంతరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌బీఐ ఈడీ లక్ష్మీకాంతరావు

విజయవాడరూరల్: జనసురక్ష పథకాలతో సామాన్య ప్రజలకు భద్రత ఉంటుందని ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్. లక్ష్మీకాంతరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్టుమెంట్ (డీఎఫ్ఎస్) మార్గదర్శకాలకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు మూడు నెలల పాటు జన సురక్ష ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా గురువారం నున్న గ్రామంలో జిల్లా లీడ్ బ్యాంక్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మెగా జన సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ కేవైసీ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా అర్హత ఉన్న పథకాలకు బ్యాంకుల ద్వారా రిజిస్టర్ చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. కొన్ని సంవత్సరాలుగా యాక్టివ్‌లో లేని ఖాతాలను కూడా రీకేవైసీ చేసుకోవాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎస్ భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా అర్హులందరూ పథకాల్లో నమోదు చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్, ఏఓ బషీర్, జీఎం ఆర్కె మహన, కెనరా బ్యాంక్ జీఎం సీజే విజయలక్ష్మీ, యూబీఐ రీజినల్ హెడ్ ఎంవీ తిలక్, ఎస్‌బీఐ డీజీఎం సితాక్షి సింగ్, రీజినల్ హెడ్ రాఘవరావు, బీఓఐ జోనల్ హెడ్ బంగార్రాజు, ఎస్ఎల్‌బీసి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, యూబీఐ డెప్యూటీ రీజినల్ హెడ్ చందన, జిల్లా ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే దహన సంస్కారం

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. ఇక్కడ కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా గ్రామంలో ఓ వ్యక్తి గురువారం మృతి చెందితే మృతదేహాన్ని ఏకంగా కృష్ణానది ఘాట్ వద్ద నడి రోడ్డు పై దహన సంస్కరణలు చేశారు. గ్రామంలో ఇద్దరి కాటికాపరుల మధ్య వివాదం ఉండటంతో ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు తెలిపారు. వాస్తవానికి ఘాట్ సమీపంలోనే శ్మశాన వాటిక ఉంది. దానికి ప్రత్యేకంగా కాటికాపరి ఉన్నాడు. అయితే మరో కాటికాపరి నదిలో వరద వస్తుందని ఏకంగా మృతదేహాన్ని నడి రోడ్డు పై దహన సంస్కరణలు చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలం వద్దకు వెళ్లగా కాటికాపరి జారుకున్నాడు. ఈ ఘటన పై గ్రామస్తులు మున్సిపాలిటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.



స్వాతంత్ర్య వేడుకలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) ముస్తాబైంది. ఎయిర్‌పోర్ట్‌లోని టెర్మినల్‌ను త్రివర్ణ పతాక రంగులతో విద్యుత్ దీపాలను అలంకరించారు. టెర్మినల్ భవనం లోపల రంగవల్లికలను తీర్చిదిద్దారు. విమానాశ్రయం ప్రవేశ ద్వారంతో పాటు సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు మూడు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

– గన్నవరం

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



నున్న(విజయవాడరూరల్): స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని నున్న వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు గురువారం జాతీయ పతకాలను చేపట్టి హర్ ఘర్ తిరంగా, వికసిత్ భారత్ 2047 2కె రన్ చేశారు. ఎస్‌బీఐ నుంచి పవర్ గ్రిడ్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రేరణతో విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బంది ప్రతి ఇంటి పై త్రివర్ణ పతాకం ఎగురవేసేందుకు ర్యాలీ నిర్వహించారన్నారు. డైరెక్టర్ ఎస్.కీర్తిరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిని ఘటనపై విచారణ

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో సచివాలయం మహిళా ఉద్యోగినిపై టీడీపీ నేత అనుచితంగా వ్యవహరించిన ఘటన పై తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్.నజీర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ గురువారం వివరాలు తెలుపుతూ విచారణ అధికారిగా డెప్యూటీ ఈఈ పి.పుల్లారావును నియమించానన్నారు. వారం రోజుల్లో జరిగిన ఘటన పై విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించానని తెలిపారు. కాగా మహిళా ఉద్యోగిని టీడీపీ నేత బూతులు తిట్టడం, దీంతో ఆమె మనస్థాపం చెంది ఆత్మహత్యా యత్నానికి యత్నించిన ఘటన పై ఉద్యోగుల్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతుంది. దీనిపై ముఖ్యనేతతో కమిషనర్ చర్చలు జరిపినట్లు సమాచారం. టీడీపీ నేతను ముఖ్యనేత ఘటన పై ప్రశ్నించగా తనతప్పు ఏమీలేదని, ఉద్యోగి ఆక్రమాలకు పాల్పడుతుందని ఆరోపణలు చేశాడని సమాచారం. గ్రామంలో కొందరు టీడీపీ నేతల వైఖరి కారణంగా ఉద్యోగులు ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెనమలూరు:కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో హేలాషరోన్ తెలిపారు. పెదపులిపాక, యనమలకుదురు గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. కృష్ణానది వరద పరిస్థితులు పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ కృష్ణానదికి వరద రావటం వలన ప్రమాదం పొంచి ఉందన్నారు. రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే కరకట్ట దిగువున ఉన్న నివాసితులు ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి రావాలని సూచించారు. యనమలకుదురులో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాత్రి వరద పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉంటారని, సమస్యలు తెత్తితే స్థానికులు వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఆర్ఐ భరద్వాజ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



కేసరపల్లి(గన్నవరం):స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ, పుణ్యా చారిటీస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పుణ్యా చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ ఆర్థిక సౌజన్యంతో రూ. 40 వేలు విలువైన నిత్యావసరాల కిట్లను 43 మంది కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు జీవీ రవిబాబు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య కార్మికులు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. అటువంటి కార్మికుల కష్టాన్ని గుర్తించి గౌరవించడం బాధ్యతగా భావించాలని తెలిపారు. రోటరీ క్లబ్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలకు విజయభూషణ్‌కుమార్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని చెప్పారు. ఏటా పంచాయతీ కార్మికులకు పుణ్యా చారిటీస్ ద్వారా నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమని సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక తెలిపారు. ఉప సర్పంచి జాస్తి శ్రీధర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, రోటరీక్లబ్ కార్యదర్శి కె. నాగరాజు, రోటేరియన్ జి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

రామవరప్పాడు:విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక తెలిపారు. శ్రావణమాసం 4వ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వరలక్ష్మి వ్రతాలు ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొనుదలచిన భక్తులు అరగంట ముందుగా ఆలయానికి చేరుకోవాలని సూచించారు. వ్రతం అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదం అందిస్తామన్నారు.